
సాక్షి ఒడిశా

సోమవారం । 24 । ఫిబ్రవరి । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 7,96,350
బంగారం : 5 గ్రాముల 720 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ

వెదురు వంతెన నిర్మాణం



గుప్తేశ్వర్‌లో వెదురు వంతెన నిర్మిస్తున్నారు. చత్తీస్‌గఢ్ భక్తుల కోసం ఈ ఏర్పాటు.

- 8లో▸



12 యూనిట్ల రక్త సేకరణ

పొడియా సమితిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 12 యూనిట్ల రక్తం సేకరించారు.

- 8లో▸

న్యూస్‌రీల్

జనావాసాల్లోకి ఎలుగుబంట్లు



ఇంటి ముందు సంచరిస్తున్న ఎలుగుబంట్లు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని దిగువవీధిలోకి శనివారం రాత్రి రెండు ఎలుగుబంట్లు చొరబడ్డాయి. కన్న మాడీ ఇంటి పరిసరాల్లో ఎలుగులు తిరగడాన్ని చూసిన స్థానికులు భయంతో ఇళ్ల తలుపులు వేసుకొని వెళ్లిపోయి.. జిల్లా అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అయితే పగటిపూట ఎలుగుబంట్లు రావడం లేదు. దీంతో రాత్రివేళ మాటువేసి పట్టుకుంటామని అటవీ సిబ్బంది తెలిపారు. సమీపంలో ఉన్న కొండల పైనుంచి ఆహారం కోసం జనావాసాల్లోకి ఎలుగులు వస్తుండడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

కలప దుంగలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కలప దుంగలతో అధికారులు

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ అటవీ రేంజ్ పరిధి నారింగిబడి అటవీ ప్రాంతంలో 10 విలువైన కలప దుంగలను అధికారులు శనివారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. ఎప్పటిలాగే ఆ ప్రాంతంలో ఏనుగుల నుంచి ప్రజలను రక్షించేందుకు పహారా కాస్తున్న సమయంలో గుర్తు తెలియని దుండగులు ముందుగా చెట్లను నరికి కలప దుంగలను ఒక మారుమూల ప్రాంతంలో దాచారు. అదే సమయంలో అటవీ రేంజర్ చందన్ గొమాంగో, ఫారెస్టర్ శివశంకర్ మహాపాత్రో, గార్డు అక్షయ కుమార్ మిశ్రో, తేజరాజ్ సున, తేజస్విని సాహు, పారా గార్డు తదితరులకు కలప దుంగలు తారసపడ్డాయి. దీంతో వాటిని స్వాధీనం చేసుకుని అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. స్వాధీనం చేసుకున్న కలప దుంగల విలువ సుమారు రూ.20 వేలు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

జీవనోపాధి మిషన్ ప్రాజెక్టు సందర్శన



పంటలను చూసి గిరిజనులతో చర్చిస్తున్న కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్ ఇతర అధికారులు

మల్కన్‌గిరి: కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్ ఆదివారం మల్కన్‌గిరి సమితి గొడిగూఢ, జయరామ్‌గూఢ పంచాయతీలోని 40 ఎకరాల్లో వేసిన జీవనోపాధి మిషన్ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. ఈ ప్రాజెక్ట్‌లో గిరిజనులు పుచ్చకాయలు, చిక్కుడి, ఉల్లి, కొల్వాడ్ ఆకుకూరలు వేసి సాగు చేస్తున్నారు. కలెక్టర్ రైతులతో చర్చించి ఏడాదికి సరిపడా సేంద్రియ ఎరువులు, పురుగు మందులు అందజేయాలని మిషన్ ప్రాజెక్ట్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సబ్ కలెక్టర్ దుర్యోధన బోయి, ప్రాజెక్ట్ మేనేజర్ విశ్వనాథ్ మిశ్రో తదితరులు పాల్గొన్నారు.

ఊరూవాడా దద్దరిల్లేలా..



ర్యాలీలో రాష్ట్ర దళిత మహాసంఘ అధ్యక్షుడు బృందావన ఖొర తదితరులు

జయపురం: జయపురంలో రాజ్యాంగ ప్రదాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్టాపన దినోత్సవం సందర్భంగా పట్టణం నీలం రంగు పతాకాలతో రెపరెపలాడింది. కొరాపుట్ జిల్లా దళిత మహా సంఘ నేతృత్వంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్టాపన దినోత్సవాలు వైభవంగా జరిగాయి. వేలాదిమంది దళిత మహా సంఘ కార్యకర్తలు జెండాలు చేతపట్టి పాల్గొన్నారు. జయపురం రథోపాడియ జంక్షన్ రఘునాథ్ మందిరం వద్ద నుంచి సర్దార్ వల్లభాయ్ పటేల్ మార్గం మీదుగా ర్యాలీ చేశారు. ఆదివాసీలు సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. ఉత్సవంలో దళిత మహాసంఘ రాష్ట్ర అధ్యక్షుడు బృందావన ఖొర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనతో పాటు మధ్యప్రదేశ్ రాష్ట్ర సఫాయి కర్మచారి కమిషన్ అధ్యక్షుడు ప్రతాప్ కర్శియ, మధ్య ప్రదేశ్ విశ్వ భారతీ మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న జన సమూహం



దళిత జెండాలతో ప్రజలు



ర్యాలీలో స్థానిక దళిత నేతలు



ఆకట్టుకున్న కోయ నృత్యం

వ్యర్థాలకు కొత్త అర్థం

- పూరీ జగన్నాథ దేవాలయం వ్యర్థాలతో సేంద్రీయ కంపోస్ట్, బయోగ్యాస్ తయారీ
- ఈ ఏడాది అక్షయ తృతీయ నుంచి ఆరంభం

భువనేశ్వర్:

పూరీ శ్రీ జగన్నాథ దేవాలయం స్వామి సేవాదుల్లో నిత్యం వినియోగించే వ్యర్థాల పునర్వినియోగం కోసం సన్నాహాలు చేస్తున్నారు. పట్టణ వ్యాప్తంగా సేకరించే చెత్తతో దేవస్థానం వ్యర్థాల్ని కలపకుండా దేవస్థానం ఆధ్వర్యంలో వ్యర్థాల పునర్వినియోగ ఉత్పత్తులు చేయాలని శ్రీ జగన్నాథ ఆలయం అధికార వర్గం నిర్ణయించింది. శ్రీ మందిరం నుంచి అందుబాటులోకి వచ్చే హరిత వ్యర్థాలను త్వరలో సేంద్రీయ కంపోస్ట్, బయోగ్యాస్ ఉత్పత్తికి ఉపయోగించనున్నారు. శ్రీ జగన్నాథ ఆలయ పరిపాలన (ఎస్జేటీఏ) పూరీ శివార్లలోని మాలతిపట్‌పూర్‌లో వ్యర్థాలను ఉత్పత్తి చేయడానికి పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ మరియు ఓటీసీసీ మద్దతుతో ఒక ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. సాధారణ రోజులో శ్రీ మందిరం నుంచి దాదాపు 3 టన్నుల వ్యర్థం అందుబాటులో ఉంటుంది. దీన్ని పట్టణంలో పోగయ్యే సాధారణ చెత్తతో కలపకూడదనే సంకల్పంతో దేవస్థానం ప్రత్యక్ష పర్యవేక్షణలో సేంద్రీయ కంపోస్టు, బయో గ్యాసు ఉత్పత్తి చేయాలని నడుం బిగించింది. స్వామి సేవలో నిత్యం వినియోగించే పువ్వులు, పత్రం వంటి హరిత వ్యర్థాల్ని పునర్వినియోగ ఉత్పత్తులు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఉత్పత్తి చేసే సేంద్రీయ కంపోస్టుని స్వామి సేవ కోసం అవసరమైన పువ్వులు, తులసి తోటల్లో ఉపయోగించనున్నట్లు ఆలయ ప్రధాన పాలన అధికారి సీఏఓ డాక్టరు అరవింద కుమార్ పాఢి తెలిపారు. మిగులు ఉత్పత్తితో బయోగ్యాస్ ఉత్పత్తి చేసేందుకు యోచిస్తున్నారు. సాధారణ రోజుల్లో శ్రీ మందిరంలో పువ్వులు, 'తులసి', ఆనంద బజార్, మహాప్రసాద అవశేషాలు వంటి దాదాపు మూడు టన్నుల హరిత వ్యర్థాలు ఉత్పత్తి అవుతాయి. కూరగాయలు, పండ్ల వ్యర్థాలతో సహా పోటు నుంచి వ్యర్థాలు దాదాపు 15 క్వింటాళ్లు, ఆనంద బజార్‌లో 5 క్వింటాళ్ల మహాప్రసాద అవశేషాలు, ఆకు వ్యర్థాలు రోజుకు 8 క్వింటాళ్లు ఉత్పత్తి అవుతాయి. 'తులసి', పూల వ్యర్థాలు 1 క్వింటాల్, ఇతర సేంద్రీయ వ్యర్థాలు కూడా 1 క్వింటాల్ హరిత వ్యర్థం ఉత్పత్తి అవుతుంది. కార్తీక పూర్ణి మ వంటి ప్రత్యేక సందర్భాలలో అదనంగా వ్యర్థాలు మరో 4 టన్నుల వరకు పెరుగుతాయి.

వ్యర్థాలను దేవాలయంలో వేరు చేసి క్రమపద్ధతిలో సేకరించి మాలతీపట్టపూర్ ప్లాంట్‌కు తరలిస్తారు. ఈ ప్రాంగణంలో రసాయన రహిత కంపోస్ట్, బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేయడానికి వాటిని శుద్ధి చేస్తారని సీఏఓ తెలిపారు. ఈ కంపోస్ట్‌ను నీలాచల ఉద్యానం, కోయిలి వైకుంఠం, ఆలయ ప్రాకారం నలు వైపులా పెరిగిన మొక్కలను సారవంతం చేయడానికి సేంద్రీయ ఎరువు ఉపయోగిస్తారు. మిగులు ఉత్పత్తి జరిగితే ప్లాంట్‌ను నడపడానికి బయోగ్యాస్ ఉపయోగిస్తారు. మేము దానిని డిస్కమ్‌లకు విక్రయించాలని ప్లాన్ చేస్తున్నాము' అని ఆయన అన్నారు.

బస్టాండ్‌లో దుకాణాల కేటాయింపు పూర్తి



కొత్త బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన దుకాణాలు

జయపురం: జయపురంలో కొత్తగా నిర్మించిన ఓఎస్ఆర్‌టీసీ బస్సు స్టాండ్‌లో ఏర్పాటు చేసిన 30 దుకాణాలను అర్హులైన వారికి కేటాయించే ప్రక్రియ పూర్తయింది. ఆర్టీసీ అధికారులు ప్రకటించిన బిడ్ కంటే ఎక్కువ కోట్ చేసిన వారికి దుకాణాలు కేటాయిస్తూ వారి పేర్లను సంబంధిత అధికారులు ప్రకటించారు. స్టాల్స్ పొందిన వారు రూ. రెండు లక్షల డిపాజిట్, హోటల్ స్టాల్, డార్మెటరీలు పొందిన వారు రూ. నాలుగు లక్షలు డిపాజిట్ చేయాల్సిఉంది. డిపాజిట్ చేసేందుకు వారం రోజులు గడువు ఇచ్చారు. అప్పటిలోగా వారు డిపాజిట్ కట్టకపోతే టెండర్లో రెండవ స్థానంలో ఉన్న వ్యక్తికి స్టాల్స్ కేటాయిస్తారు. ఈ ప్రక్రియపై పాత ఓఎస్ఆర్‌టీసీ బస్సు స్టాండ్‌లో కొన్ని దశాబ్దాలుగా ఉంటున్న వ్యాపారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టెండర్‌తో సంబంధం లేకుండా తమకు కొత్త బస్సు స్టాండ్‌లో స్టాల్స్ కేటాయించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇదే డిమాండ్‌తో హైకోర్టును ఆశ్రయించారు. అయితే పాత బస్సు స్టాండ్ వ్యాపారుల నిమిత్తం పది స్టాళ్లు, ఒక హోటల్ కేటాయించారు. వారిలో ఎక్కువ అద్దె కోట్ చేసి పాడిన వారికి వాటిని కేటాయిస్తారు. అయితే అందుకు పాత బస్సు స్టాండ్ వ్యాపారులు నిరాకరించారు. తాము ఎక్కువ అద్దెకు టెండర్ వేయమని వారు స్పష్టం చేశారు. వారికి గత ఏడో తేదీ సాయంత్రం వరకు అధికారులు సమయం కేటాయించారు. అయితే వారు ముందుకు రాలేదు. తిరిగి అధికారులు ఈ నెల 19వ తేదీ వరకు గడువు ఇచ్చి నిర్ణయం తెలపమని సూచించారు. అయితే బిడ్ డబ్బుకు వారు అంగీకరించలేదు. దీంతో బస్సు స్టాండ్ ప్రెసిడెంట్, సబ్‌కలెక్టర్ ఎ.శౌశ్యరెడ్డి, ఓఎస్ఆర్‌టీసీ డీటీఎం ఈశ్వర మహాపాత్రోలు స్టాల్ నెంబర్ 21 (ఈ స్టాల్ కి ఎంపూ టెండర్ వేయలేదు)కి తప్ప మిగతా అన్ని స్టాల్స్‌తో పాటు హోటళ్లు, డార్మిటరీలకు అత్యధిక టెండర్ వేసిన వారికి కేటాయిస్తూ పేర్లు ప్రకటించారు. హైకోర్టులో పాత బస్సుస్టాండ్ వ్యాపారులు వేసిన రిట్‌పై మార్చి ఆరో తేదీన విచారణ ఉన్నా అన్ని స్టాళ్లను ఎక్కువ అద్దె కోట్ చేసిన వారికి కేటాయింటంపై పాత బస్సుస్టాండ్ వ్యాపారులు అసంతృప్తి చెందుతున్నారు. పాత బస్సు స్టాండ్ వ్యాపారుల నిమిత్తం కేటాయించిన 10 స్టాళ్లు, ఒక హోటల్ కూడా ఎక్కువ టెండర్లు వేసిన వారికి ఖరారు చేసారు. దీనిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పాతబస్టాండ్ వ్యాపారులు హైకోర్టు ఎటువంటి తీర్పు ఇస్తుందా అని ఎదురు చూస్తున్నారు.

శ్రావణీ హైడ్రో ప్రాజెక్టుపై అధికారుల దర్యాప్తు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కుంద్ర సమితి డుమజోడి వద్ద శ్రావణీ హైడ్రో పవర్ ప్రాజెక్టుపై పలు ఆరోపణలు వచ్చాయి. దీంతో అటవీ, సాగునీటి ప్రాజెక్టు విభాల ఉన్నతాధికారుల కమిటీ దర్యాప్తు ప్రారంభించింది. హైడ్రో ప్రాజెక్టు నిర్మాణంలో శ్రావణీ సంస్థ నీతి, నియమాలు తుంగలో తొక్కుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. నది డ్యామ్ నిర్మాణంపై జీపీఎం సర్వే జరపలేదని, నదీ హద్దులను నిర్ధారించలేదని, ప్రాజెక్టు సురక్షా వాల్‌పై దృష్టిపెట్టలేదని ఆరోపణలు వచ్చాయి. దీంతో ఉన్నతాధికారుల కమిటీ దర్యాప్తు ప్రారంభించింది. డివిజనల్ ఫారెస్టు అధికారి ప్రతాప్ బెహర, అప్పర్ కొలాబ్ హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టు ప్రభుత్వ ఇంజినీర్ రజనీకాంత మిశ్ర, ఏసీఎఫ్ ప్రసన్న కుమార్ మిశ్ర, అమిత్ ప్రకాశ్ నాయిక్, కుంద్ర అటవీ విభాగ డిప్యూటీ రేంజర్ ఫారెస్టర్ తదితర అధికారులు డుమాజోడి హైడ్రో ప్రాజెక్టు ప్రాంతాన్ని ఆదివారం సందర్శించారు. తొలుత నది డ్యామ్ నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. సముద్ర మట్టానికి 12 మీటర్ల ఎత్తులో డ్యామ్ నిర్మాణం జరగ్గా.. దాన్ని దానిని ప్రైవేట్ టెక్నికల్ ఏజెన్సీ ద్వారా టెక్నికల్ సర్వే జరుపలేదని, కంపెనీ తన సొంత ఇంజినీర్ల ద్వారా సర్వేలు జరుపుతుండటం వలన వాటి నాణ్యతపైన సందేహం వ్యక్తం చేశారు. వెంటనే నది మధ్య భాగం నుండి నదీ బౌండరీ 100 మీటర్ల వరకు నిర్మించాలని అప్పర్ కొలాబ్ ప్రభుత్వ ఇంజినీర్ రజణీకాంత మిశ్ర ఆదేశించారు. అధికారులు పవర్ హౌస్, కెనాల్ పనులు పరిశీలించారు. ప్రాజెక్టు నిర్మాణానికి మంజూరు చేసిన 4.6 హెక్టార్ల అటవీ స్థలంలో నిర్మాణం జరుగుతుందా లేక నిబంధనను ఉల్లంఘించార అనే విషయంపై అధికారుల బృందం సమీక్షించింది. ప్రాజెక్టు నిర్మాణంలో ఎటువంటి పొరపాట్లు ఉన్నా వాటిని సరిదిద్దాలని శ్రావణీ హైడ్రో ప్రాజెక్టు యాజమాన్యానికి సూచించారు. తమ నివేదికను ఈ నెల 25వ తేదీలోగా ప్రభుత్వానికి అందజేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.



డుమజోడి వద్ద ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలిస్తు యాజమాన్య ప్రతినిధులతో చర్చిస్తున్న అధికారులు

గిరి రైతులకు నీటి పంపులు పంపిణీ



పైపులను అందజేస్తున్న అధికారులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో సమన్విత ఆదివాసీ అభివృద్ధి సంస్థ ద్వారా ముఖ్యమంత్రి జనజాతి జీవికా మిషన్ పథకం ద్వారా జనజాతి జీవికా హితాధికారులకు నీటి పంపులను గిరి రైతులకు ఆదివారం పంపిణీ చేశారు. జిల్లా సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అశోక్ పరిడా, ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్ విశ్వనాథ్‌మిశ్రో పాల్గొన్నారు. నీటి పంపుల పంపిణీకు ఒడిశా కృషి పరిశ్రమ నిగమ్, మల్కన్‌గిరి జిల్లా అధికారి శాంతను కుమార్ సామల్ సహకరించారు. వీటిన వినియోగంపై గిరిజనల రైతులకు అధికారులు అవగాహన కల్పించారు.

రక్తదాన శిబిరం



శిబిరంలో రక్తదానం చేస్తున్న జవాన్లు

రాయగడ: స్థానిక సాయిప్రియనగర్‌లో గల ప్రభుత్వ అర్బన్ ఆస్పత్రిలో సాయిప్రియ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం జరిగింది. కార్యక్రమానికి నాల్గో బెటాలియన్ సీఆర్‌పీఎఫ్2 కమాండెంట్ ఫిరోజ్ కుజుర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శిబిరంలో 44 యూనిట్ల రక్తం సేకరించారు. ప్రభుత్వ ఆస్పత్రి ఏడీఎం డాక్టర్ మమత చౌదరి, డాక్టర్ గౌతం పట్నాయక్ పర్యవేక్షణలో జరిగిన శిబిరంలో క్లబ్ సభ్యులతో పాటు సీఆర్‌పీఎఫ్ జవాన్లు రక్తదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్‌కు చెందిన డాక్టర్ సురేష్ కుమార్, దేవరాజ్ పండ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు



పోటీల్లో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకుంటున్న విద్యార్థులు

రాయగడ: స్థానిక సాయిప్రియ నగర్‌లోని సాయిప్రియ వెల్ఫేర్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణలో నాగరికుని బాధ్యత అనే అంశంపై వక్తృత్వ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో దక్షిత వల్లి ప్రథమ స్థానం, బబులి బిశ్వకర్మ ద్వితీయ స్థానం, నవస్మిత నాయక్ తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. క్లబ్ కార్యదర్శి దయానంద కడంగ అధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు న్యాయవాది ప్రదీప్ కుమార్ దాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో నిర్వాహకులు

☛ సెంచూరియన్ స్కూల్‌లో...

మార్చి 7వ తేదీన జయపురంలో జరగనున్న ప్రమేయ ప్రమేయ సన్మాన్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని స్థానిక సెంచూరియన్ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు వక్తృత్వ పోటీలను ఆదివారం నిర్వహించారు. సెంచురియన్ విశ్వ విద్యాలయం మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాజేష్ పాఢి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటువంటి తరహా పోటీలు నిర్వహించడం వలన విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. ప్రకృతి విపత్తు అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

క్రికెట్ స్టేడియం నిర్మాణానికి స్థల సేకరణ

జయపురం: పట్టణంలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి అధికారులు చురుకుగా పావులు కదుపుతున్నారు. దీనికి సంబంధించి అనువైన స్థల సేకరణకు గత కొద్ది రోజులుగా అధికారులు చేసిన ఫలితాలు ఫలించాయి. క్రికెట్ స్టేడియం నిర్మాణానికి 7 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎంపిక చేశారు. జయపురం సబ్ కలెక్టర్ అక్కవరం శౌశ్యరెడ్డి స్థలాన్ని సందర్శించి ఖరారు చేశారు. గాంధీ చౌక్ కెనాల్ రోడ్డులో సత్‌సంఘ్ విహార్, డొంగాగుడ గ్రిడ్ సబ్‌స్టేషన్ మధ్య ప్రభుత్వ స్థలాన్ని క్రికెట్ స్టేడియం నిర్మాణానికి ఎంపిక చేశారు. ఎంపిక చేసిన స్థలం ఆమోదం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నారు. ప్రతీ సమితిలో ఒక క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించడంతో చర్యలు తీసుకుంటున్నారు. దీంతో త్వరలోనే జయపుర క్రికెట్ స్టేడియం నిర్మాణం జరుగుతుంది. ఫలితంగా క్రీడాకారులకు అవకాశాలు పెరుగుతాయని క్రీడా ప్రేమికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



క్రికెట్ స్టేడియానికి ఎంపిక చేసిన సత్‌సంగ్ విహార్ ప్రాంతంలోని స్థలం

ఉత్సాహంగా సెంచూరియన్ వర్సిటీ వార్షికోత్సవం

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



షంబాజీ పాత్రలో ప్రొఫెసర్ ప్రఫుల్ల కుమార్ పండా



వార్షికోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యక్షులు డి.ఎన్.రావు, పద్మ దంపతులు



మ్యూజికల్ నైట్‌లో ఎల్వీ రేవంత్

పర్లాకిమిడి: ఆర్.సీతాపురంలోని సెంచూరియన్ వర్సిటీ వార్షికోత్సవాన్ని 'గజజ్యోతి 2025'పేరుతో ఉత్సాహంగా జరుగుతున్నాయి. మూడో రోజు శనివారం రాత్రి వివిధ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సినీ సంగీత సామ్రాజ్యంలో ధ్రువతార ప్రముఖ గాయకులు ఎల్.వి.రేవంత్ మ్యూజికల్ నైట్‌లో హిందీ, తెలుగు పాటలు పాడి ఉర్రూతలూగించారు. మ్యూజికల్ నైట్‌తో పాటు విద్యార్థులు వేదిక వద్ద వివిధ తినుబండారాల క్యాఫ్టేరియా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సెంచూరియన్ వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య డి.ఎన్.రావు, రిజిస్ట్రార్ డాక్టర్ అనితా పాత్ర, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ దుర్గాప్రసాద్ పాఢి పాల్గొన్నారు.



పాల్గొన్న విద్యార్థులు

క్లుప్తంగా

శ్రీముఖలింగంలో బారికేడ్లు ఏర్పాటు



ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో ఈ నెల 26 నుంచి 28 వరకు జరగనున్న శివరాత్రి ఉత్సవాలకు బారికేడ్ల ఏర్పాటు దాదాపు పూర్తయిందని ఈఓ పి.ప్రభాకరరావు ఆదివారం తెలిపారు. ఆలయం లోపల, ఆవరణ, ముందు భాగం, ప్రత్యేక దర్శనాలకు క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆలయం ధ్వజ స్తంభం, వెనుక భాగం,ఉత్తర, దక్షిణ భాగాల వైపు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. స్వామివారి చక్రతీర్థ స్నానాలకు సంబంధించి నదిలో బారికేడ్ల నిర్మాణం ఏర్పాటు జరుగుతోందన్నారు.

పంచధామ క్షేత్రం శివరాత్రి ఉత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు

టెక్కలి: కోటబొమ్మాళి మండలం చిన్నహరిశ్చంద్రాపురం గ్రామంలో శ్రీ పంచధామ క్షేత్రంలో పంచమ మహా శివరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి పోస్టర్, కరపత్రాలను నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కె.అచ్చెన్నాయుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు యు.కనకరాజు, నాయకులు కె.హరివరప్రసాద్, కె.ప్రభాకర్, పి.శైలజ, వి.వి జయలక్ష్మి, వి.కామేశ్వరరావు, బి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

'కూటమి' ప్రకటన మేధావులను అవమానించడమే



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పోతల దుర్గారావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మేధావుల చట్టసభకు సంబంధించి కూటమి ప్రభుత్వం అభ్యర్థిని ప్రకటించడం మేధావుల్ని అవమానపరచడమేనని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతల దుర్గారావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని అంబేడ్కర్ విజ్ఞాన మందిర్‌లో ఆదివారం బహుజన సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు రాజకీయాలకు అతీతంగా జరగాలని, గతంలో ఎప్పుడూ ఏ పార్టీ అభ్యర్థిని ప్రకటించలేదన్నారు. అందుకు విరుద్ధంగా కూటమి ప్రభుత్వం ప్రకటించడం దారుణమన్నారు. అనంతరం ఎన్నికల హామీల పోస్టర్‌ని ఆవిష్కరించారు.

వత్సవలసలో మద్యం బాటిళ్లు పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

గార: మండలంలోని వత్సవలస గ్రామ సమీపంలో ఓ వ్యక్తి నుంచి 10 మద్యం బాటిళ్లు పట్టుకున్నామని ఎక్సైజ్ ఎస్సై బి.రాజేష్ తెలిపారు. ఆదివారం ఉదయం గస్తీ నిర్వహిస్తుండగా వ్యక్తిని అదుపులోకి తీసుకోగా బాటిళ్లు గుర్తించామన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శుభకార్యానికి వెళ్లి వస్తుండగా..

- ఆటో బోల్తా..పలువురికి గాయాలు



మెళియాపుట్టి: మండలంలోని పెద్దపద్మాపురం–మెళియాపుట్టి గ్రామాల మధ్య ఓ ఆటో బోల్తాపడటంతో పలువురు గాయపడ్డారు. గార మండలం అరికిపేట గ్రామస్తులు ఆదివారం మెళియాపుట్టి మండలంలో పెళ్లిచూపులకు హాజరై తిరిగి వస్తుండగా ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో కృష్ణారావు, అప్పలనాయుడు తీవ్ర గాయాలు కాగా.. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను మెళియాపుట్టి పీహెచ్‌సీలో చికిత్స అందించి మెరుగైన వైద్యసేవల కోసం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

12 యూనిట్ల రక్తసేకరణ



ట్రేడ్ ఇండియా సభ్యులు



రక్తదానం చేస్తున్న పోడియా గ్రామ ప్రజలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా పోడియా సమితి కార్యాలయంలో ఆదివారం ట్రేడ్ ఇండియా ట్రస్టు సంస్థ తరఫున రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి 12 యూనిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పోడియా సమాజ్ సేవకుడు డాక్టర్ ఎస్ రాఘవరావు, పోడియా సర్పంచ్ గంగా కారామ్, కె.బాలయ్య, ట్రేడ్ ఇండియా ట్రస్టు డైరెక్టర్ ఎం.బాసంత్ రాజ్ తదితరులు పాల్గొన్నారు. కలిమెల ఆరోగ్య కేంద్ర వైద్యులు ఈ రక్తాన్ని సేకరించారు.



రక్తదాన శిబిరం వద్ద టెస్టులు చేయించుకుంటున్న గ్రామస్తులు

గుప్తేశ్వర్-సంజోగాంకు వెదురు వంతెన నిర్మాణం



శబరి నదిపై దాటేందుకు వెదురు వంతెన తయారు చేస్తున్న దృశ్యం

జయపురం: ఒడిశాలోని ప్రసిద్ధ శైవ క్షేత్రాల్లో ఒకటిగా పేరు గాంచిన గుప్తేశ్వర్ పుణ్య క్షేత్రం వద్ద గుప్తేశ్వర–ఛత్తీస్‌గఢ్ మధ్య ఉన్న శబరి నదిపై వెదురు వంతెన నిర్మిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రజలు గుప్తేశ్వర మహాశివుడిని దర్శించు కోవాలంటే దాదాపు 600 మీటర్లు శబరి నది దాటి రావాలి. ఎల్లప్పుడూ నీటితో కళకళలాడే శబరిలో దిగి రావాలంటే ప్రాణాలతో చెలగాటమే. దీంతో ఆ రాష్ట్ర భక్తులకు అనువుగా వెదురు వంతెన తయారు చేస్తున్నారు,



వెదురు వంతెనకు కలప దుంగలు సేకరిస్తున్న ప్రజలు

వ్యాపారాలు చిక్కేను!



కొనుగోలుదారులు లేక వెలవెలబోయిన చికెన్‌షాపు



- జిల్లాలో బర్డ్ ఫ్లూ ప్రభావం లేకపోయినా పడిపోయిన చికెన్ అమ్మకాలు
- లబోదిబోమంటున్న చికెన్ సెంటర్ నిర్వాహకులు
- హోటల్స్, రెస్టారెంట్లదీ అదే పరిస్థితి
- నిర్భయంగా చికెన్ తినవచ్చంటున్న అధికారులు



మటన్‌షాపు వద్ద గుమిగూడిన జనాలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కరోనా తరువాత మాంసప్రియులు ఎక్కువయ్యారు. కోళ్లఫారాలు, హోటల్స్ రంగంలో వ్యాపారాలు బాగా పెరిగాయి. అయితే రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో బర్డ్ ఫ్లూ ప్రభావం ఉందనడంతో 20 రోజులుగా చాలామంది చికెన్, గుడ్లు తినడం మానేశారు. శ్రీకాకుళం జిల్లాలో బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్ లేదని పశుసంవర్ధకశాఖ అధికారులు, వైద్యులు, నిపుణులు చెబుతున్నా మాంసం తినేందుకు అంత ఆసక్తి చూపడం లేదు. దీంతో హోటల్స్ యజమానులు, చికెన్ హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు కుదేలవుతున్నారు. హోటల్స్, రెస్టారెంట్లకు వెళ్లే వారు కూడా మటన్, ప్రాన్ బిర్యానీలకే మొగ్గుచూపుతున్నారని యజమానులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో చికెన్ తినడం వల్ల ఎటువంటి నష్టం లేదని చెప్పేందుకు పౌల్ట్రీ వ్యాపారులు ఎక్కడికక్కడ స్టాల్స్ పెట్టి ఉచితంగా చికెన్ పకోడి, బాయిల్డ్ ఎగ్ ఇచ్చి ప్రాక్టికల్‌గా తిని చూపిస్తున్నారు.

కుదేలైన హోటల్ రంగం:

సాధారణంగా హోటల్, రెస్టారెంట్లలో భోజనం చేసేవారు ఎక్కువగా ఆర్డర్ ఇచ్చేది నాన్ వెజ్ వంటకాలే. అందులో చికెన్‌తో వండే ఆహార పదార్థాలకే పెద్దపీట. ఇప్పుడు బర్డ్‌ఫ్లూ ప్రచారంతో చాలామంది హోటల్స్‌కు వెళ్లడం మానేశారు. ఒకవేళ వెళ్లినా శాకాహార వంటకాలు, రొయ్యలు, చేపలు, మటన్‌తో తయారుచేసే ఆహార పదార్థాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఫలితంగా హోటల్స్ నష్టాలు చవిచూస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు చిన్న, పెద్ద హోటల్స్, రెస్టారెంట్స్, దాబాలు వెయ్యికిపైగా ఉంటాయి. రోజుకి తక్కువలో తక్కువ రూ.20వేలు నుంచి రూ.లక్ష వరకు వ్యాపారం జరిగేది. చికెన్ బిర్యానీ, ఎగ్ ఐటమ్స్ తినకపోవడం వల్ల కనీసం 10 వేలు రూపాయల వ్యాపారం కూడా జరగడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. ఓ రెస్టారెంట్‌లో రోజుకు 20 కేజీల ధమ్‌బిర్యానీ తయారుచేస్తే మళ్లీ రెండోసారి వండాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు రెండు కేజీలు బిర్యానీ వండినా అమ్మడం కష్టమైపోతోంది. హోటల్ తెరిస్తే విద్యుత్ చార్జీలు, భవనం అద్దె, కూలీలు, కుక్ వంటి మెయింటెనెన్స్‌తో కలిపి సుమారు రూ.30వేలు ఖర్చవుతుంది. పట్టుమని రూ.పది వేలు వ్యాపారం కూడా జరగకపోతే హోటళ్లను ఎలా నడిపించగలమని వ్యాపారులు లబోదిబోమంటున్నారు.

పడిపోయిన అమ్మకాలు..

బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్ లేనప్పుడు జిల్లాలో రోజుకు సరాసరి రెండు న్నర లక్షల కేజీ చికెన్ అమ్మకాలు జరిగేవి. కిలో ధర రూ.240 ఉన్నప్పుడు సుమారు రూ.6కోట్లు వ్యాపారం జరిగేది. ఇప్పుడు జిల్లా అంతా కలిపి 30 వేల కేజీలు కూడా అమ్మకం జరగడం లేదని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. గత 20 రోజులుగా పౌల్ట్రీ రంగంలో ఒక్క మన జిల్లాలోనే రూ.70కోట్లు నష్టం ఉంటుందని చెబుతున్నారు. ఓ చిన్న చికెన్ షాపులో సాధారణంగా ఆదివారం 100 నుంచి 150 కేజీలు అమ్మకాలు జరిగేవి. ఇప్పుడా ట్టుమని 10 కేజీలు కూడా అమ్మలేకపోతున్నామని దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉచితంగా చికెన్ పకోడి, గుడ్లు పంపిణీ



ఉచితంగా చికెన్ పకోడి, గుడ్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): చికెన్, ఎగ్ తినడం వల్ల ఎటువంటి ఇబ్బందులు లేవని, జిల్లాలో ఎటువంటి బర్డ్‌ఫ్లూ ప్రభావం లేదని పశుసంవర్ధక శాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ మెట్ట వెంకటేశ్వర్లు అన్నారు. శ్రీకాకుళం పాతబస్టాండ్, ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో వెన్‌కాబ్ ఆధ్వర్యంలో ఆదివారం చికెన్, ఎగ్ మేళా నిర్వహించారు. ఉచితంగా చికెన్ పకోడి, ఉడికించిన గుడ్డును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశంలో 100 డిగ్రీ సెల్సియస్‌లలో మాంసం ఉడికిస్తామని, ఈ పరిస్థితుల్లో ఎటువంటి బర్డ్‌ఫ్లూ రాదన్నారు. ప్రజల్లో చికెన్‌పై భయం పోగొట్టేందుకే మేళా నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో బ్రాయిలర్ ఫార్మర్స్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్వరరావు, వెన్‌కాబ్ మేనేజర్ గణేష్, డాక్టర్ శ్రీనివాసరావు, రమణరావు తదితరులు పాల్గొన్నారు.

చక్కగా తినొచ్చు..



బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్ శ్రీకాకుళం జిల్లాలో అస్సలు లేదు. మిగిలిన జిల్లాలో కూడా బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్ తగ్గుముఖం పట్టింది. ఏ ఒక్కరూ భయపడాల్సిన అవసరం లేదు. భారతీయ వంటల విధానం ప్రకారం 100 డిగ్రీల సెంటిగ్రేడ్‌లో వంటకాలు చేస్తుంటాం కాబట్టి ఎటువంటి ఎఫెక్ట్ ఉండదు. కోళ్ల రైతులు కూడా కొత్త బ్యాచ్‌లు వేసుకోవాలి.

– డాక్టర్ కె.రాజగోపాలరావు, పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు

ఆదుకోవాలి..



హోటల్లో గతంలో చికెన్ వంటకాలకు సంబంధించి రూ.40వేలు పైగా వ్యాపారమైతే ఇప్పుడు రూ.పది వేలు అమ్మడం కష్టమైపోతోంది. అద్దెలు చెల్లించలేక, చెఫ్‌లు, కూలీల చార్జీలు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికే చాలా హోటల్స్ తాత్కాలికంగా మూతపడ్డాయి. ప్రభుత్వం స్పందించి హోటల్స్ రంగాన్ని ఆదుకోవాలి.

– మెట్ట నాగరాజు, హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, శ్రీకాకుళం

వ్యాపారాల్లేవ్..



చికెన్ అమ్మకాలు ప్రతి ఆదివారం 100 నుంచి 150 కేజీలు అమ్మకాలు జరిగేవి. మూడు వారాలుగా రోజంతా కలిసి 20 కేజీలు అమ్మడం కష్టమైపోతోంది. ఈ నెల విద్యుత్‌చార్జీలైనా వస్తాయో రావో అనుమానంగా ఉంది. గత 20 రోజులుగా వ్యాపారాలు లేక అద్దెలు చెల్లించలేక మెయింటెనెన్స్ కూడా ఇబ్బందిగా మారింది. ఇదే పరిస్థితి కొనసాగితే షాపు మూసేయాల్సిందే.

– గ్రంథి జగదీష్, చికెన్ షాపు యజమాని, హోమియోనగర్, శ్రీకాకుళం

విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

- త్వరలో సీఎంను కలుస్తాం
- విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ



ప్రసంగిస్తున్న విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవర సత్యనారాయణ

విశాఖ–లీగల్: విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామని విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది బెవర సత్యనారాయణ స్పష్టం చేశారు. ఆదివారం నగరంలోని విశాఖ న్యాయవాదుల సంఘం ఆవరణలో ఆరు జిల్లాల న్యాయవాదుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో న్యాయవాదులందరూ విశాఖకు హైకోర్టు బెంచ్, కేంద్ర పారిశ్రామిక ట్రిబ్యునల్ ఏర్పాటుకు ముందడుగు వేయాలని నిర్ణయించారు. శ్రీకాకుళం, పార్వతీపురం వంటి సుదూర ప్రాంతాల నుంచి విజయవాడ వెళ్లాలంటే చాలా భారంగా ఉందని న్యాయవాదులు తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవరా సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికే విశాఖ అన్ని రకాలుగా మోసానికి గురైందని వెల్లడించారు. అంతర్జాతీయ ఖ్యాతిని గడిస్తున్న విశాఖకు హైకోర్టు బెంచ్ కేటాయించడం అన్ని విధాల శ్రేయోదాయకమన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు పి. నరసింహారావు మాట్లాడుతూ విశాఖలో హైకోర్టు ఏర్పాటు సంబంధించి న్యాయశాఖకు అభ్యంతరాలు ఉండకపోవచ్చన్నారు. 1993లో హైకోర్టుమెంట్ సాధనకు న్యాయవాదులు చేసిన ఉద్యమాలను గుర్తు చేస్తూ భవిష్యత్తులో ప్రజల భాగస్వామ్యంతో పోరాడతామన్నారు. సోమవారం నుంచి నల్లబ్యాడ్జీలు ధరించి న్యాయస్థానానికి హాజరవుతామని వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది లక్ష్మీ రాంబాబు, బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, ఏవీ పార్వతీశం, కృష్ణ శేఖర్, పూర్వ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, పాలకొండ, బొబ్బిలి, రాజాం, గజపతినగరం, అనకాపల్లి, చోడవరం, తుని, యలమంచిలి, విజయనగరం, ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో న్యాయవాదులు ఈ సదస్సులో పాల్గొన్నారు. న్యాయవాద సంఘం కార్యదర్శి డి.నరేష్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.



ఆరు జిల్లాల నుంచి హాజరైన న్యాయవాదులు

యువకుడు ఆత్మహత్యాయత్నం

టెక్కలి : కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురం పంచాయతీ బావన్నపేట గ్రామానికి చెందిన దుంపల వాసుదేవరావు (24) ఆదివారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. వాసుదేవరావు గత ఏడాది డిసెంబర్ 18న సీమెన్ ఉద్యోగం కోసం ముంబై వెళ్లాడు. అక్కడ అనారోగ్యంతో బాధపడుతూ మూడు రోజుల క్రితం కొన్ని మందులు తీసుకొని ఇంటికి చేరాడు. అందరితో కలిసిమెలిసి తిరుగుతూ ఆదివారం ఉదయం నరసన్నపేటలో ఒక రోగిని పరామర్శించి మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నాడు. పొలానికి వినియోగించిన మిగిలిన పురుగుల మందును తండ్రి అప్పన్న ఇంట్లో దాచి పెట్టాడు. ఇంటికి చేరిన వాసుదేవరావు ఆ మందు తాగుతుండగా తల్లి లక్ష్మి గమనించి డబ్బా లాక్కొంది. వెంటనే ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటినా కోటబొమ్మాళి సామాజిక అసుపత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ నుంచి జారిపడి డ్రైవర్ మృతి



మృతి చెందిన మార్కండరావు

టెక్కలి రూరల్ : ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్ ప్రమాదవశాత్తు జారిపడటంతో దుర్మరణం చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెళియాపుట్టి మండలం బంజీరు గ్రామానికి చెందిన గూడ మార్కండరావు(33) టెక్కలి జూనియర్ కళాశాల మైదానంలో నిల సివిల్‌సప్లయ్ ఎంఎల్ఎస్ గొడౌన్‌లో బియ్యం రవాణా చేసే ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ట్రాక్టర్‌లో బియ్యం లోడు వేసుకుని నందిగాం మండలంలో అన్‌లోడ్ చేశాడు. తిరిగివస్తుండగా టెక్కలి సమీప పాత రవి దాబా వద్ద అప్రోచ్ రోడ్డులోకి తిరుగుతున్న సమయంలో ఉమ్మి ఊస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మార్కండరావుకు భార్య, పిల్లలు ఉన్నారు. టెక్కలి పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

ఆదిత్యాలయానికి పోటెత్తిన భక్తజనం



అరసవల్లి ఆలయం ముందు భక్తులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మాఘమాసం మూడో ఆదివారం సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలిరావడంతో అరసవల్లి ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. ఇంద్రపుష్కరిణి వద్ద సంప్రదాయబద్ధంగా మహిళలు క్షీరాన్నాన్ని వండి స్వామికి నివేదించారు. అంతరాలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి.. ఉదయం 6 గంటల నుంచే సర్వదర్శనాలకు అనుమతించేలా ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ చర్యలు చేపట్టారు. భారీగా భక్తులు తరలిరావడంతో ఎండ వేడిమి నుంచి రక్షణ కోసం ఆలయ ఈవో వై.భద్రాజీ ఆధ్వర్యంలో చలువ పందిళ్లు వేయించి ఉచితంగా మంచినీటిని సరఫరా చేశారు. ఒక్క రోజులో వివిధ దర్శన మార్గాల టికెట్ల విక్రయాల ద్వారా రూ.8,09,600, విరాళాలు, ప్రత్యేక పూజల ద్వారా రూ.1,34,906, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 2.55 లక్షల వరకు ఆదాయం లభించినట్లు ఈఓ వెల్లడించారు. అలాగే ఐఏఎస్ అధికారి సుబ్బారావు కుటుంబసమేతంగా ఆదిత్యున్ని దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ కనకరాజు, ప్రధానార్చకులు శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఇక వత్సవలస రాజమ్మ తల్లి ఉత్సవాల సందర్భంగా వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆ ప్రభావం అరసవల్లి ఆలయ దర్శనాల్లో కనిపించింది. దీంతో సాయంత్రం వరకు భక్తుల తాకిడి అరసవల్లి క్షేత్రంలో కనిపించింది.



పుష్కరిణి ఒడ్డున క్షీరాన్నం వండుతున్న మహిళలు



ఐఏఎస్ అధికారి సుబ్బారావుకు జ్ఞాపిక అందజేస్తున్న కనకరాజు, శంకరశర్మ

31 కేజీల గంజాయితో ఇద్దరు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మీసాల చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి గుజరాత్ రాష్ట్రం సూరత్‌కు అక్రమంగా గంజాయి తరలించేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఇచ్ఛాపురం సీఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా కొడల పీఎస్ పరిధిలోని నాయికనిపల్లి గ్రామానికి చెందిన ఉపేంద్ర స్వైన్, అదే గ్రామానికి చెందిన గౌడ సాహిలు వ్యసనాలకు బానిసయ్యారు. కుటుంబ పోషణకు గంజాయిని అక్రమ రవాణా చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో కొడల గ్రామానికి చెందిన దీపక్ అనే వ్యక్తి నుంచి 31.110 కేజీల గంజాయిని తీసుకొని గుజరాత్ రాష్ట్రం సూరత్‌లో దీపక్ సూచించిన వ్యక్తికి అందజేయడానికి బయలుదేరారు. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌కు శనివారం సాయంత్రం చేరుకున్నారు. ఇద్దరూ అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు తనిఖీ చేశారు. 31.110 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. గంజాయి అక్రమరవాణ జరగకుండా చాకచక్యంగా వ్యవహరిస్తున్న ఇచ్ఛాపురం సర్కిల్ పోలీస్ సిబ్బందిని ఎస్పీ మహేశ్వరరెడ్డి అభినందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ ముకుందరావు, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, గ్రామస్తులు

గార: మండలంలోని కొర్ని గ్రామానికి చెందిన రైతు వజ్జ రమణమూర్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం.. రమణమూర్తి (37) వ్యవసాయం చేసుకుంటూనే అప్పుడప్పుడు ఉపాధి హామీ పనులకు వెళ్తుండేవాడు. ఏం జరిగిందో గానీ శనివారం సాయంత్రం నుంచి కనిపించలేదు. భార్య భాగ్యలక్ష్మీ ఆందోళనకు గురై గ్రామస్తుల సాయంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆదివారం ఉదయం గ్రామ సమీపంలోని తోటలో చెట్టుకు ఉరేసుకుని విగతజీవిగా కనిపించడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. రమణమూర్తికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నా. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని గార ఎస్ఐ ఆర్.జనార్దనరావు తెలిపారు.

క్లుప్తంగా

గడ్డి ట్రాక్టర్ దగ్ధం


కాలిపోతున్న ట్రాక్టర్‌లో ఉన్న గడ్డి

గుర్ల: మండలంలోని గరికివలస, ఆనంద పురం రోడ్డుపై గడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ఆదివారం దగ్ధమైంది. గరికివలస నుంచి భోగాపురం వెళ్తున్న గడ్డి ట్రాక్టర్‌కు ఆనంద పురం రోడ్డుపై ఉన్న విద్యుత్ వైర్లు తాకడంతో మంటలు చేలరేగాయి. సమాచారం మేరకు విజయనగరం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆదుపుచేశారు. ఈ ప్రమాదంలో గడ్డి మొత్తం కాలిపోయింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటు వంటి గాయాలు కాలేదు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామం వద్ద గల బైపాస్ రోడ్డుపై ఒంపల్లి గ్రామానికి వెళ్లే జంక్షన్ వద్ద డివైడర్‌ను గజపతినగరానికి చెందిన బి.బాలు తన ద్విచక్ర వాహనంతో ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో విజయనగరంలోని మహరాజా కేంద్ర సర్వజన ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. ప్రమాదం గురించి ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై మహేష్ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి


ఆనంద్ మృతదేహం

గంట్యాడ: మండలంలోని గింజేరు జంక్షన్ వద్ద ఆదివారం రెండు బైక్‌లు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం నుంచి స్కూటీపై అల్లాడ ఆనంద్, కుమార్ రాజులు, చెల్లూరుకు చెందిన దాసరి నారాయణరావు బైక్‌పై అదే రోడ్డులో వెళ్తుండగా గింజేరు జంక్షన్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి స్కూటీని బైక్ ఢీకొట్టింది. దీంతో స్కూటీ వెనుక కూర్చున్న అల్లాడ ఆనంద్ తుల్లి రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్కూటీని నడుపుతున్న కుమార్‌రాజాకు, మోటార్ బైక్ నడుపుతున్న దాసరి నారాయణరావుకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో వారిద్దరిని 108 అంబులెన్సులో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఎస్సై సాయి కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన కృష్ణ మూర్తి (ఫైల్)

పార్వతీపురం టౌన్: సీతానగరం మండలం గెడ్డలుప్పి గ్రామానికి చెందిన చొంగలి కృష్ణ మూర్తి చాలాకాలంగా మెడ, రెండుభుజాల నొప్పితో బాధపడుతున్నాడు. మూడు రోజుల క్రితం నొప్పిని భరించలేక గడ్డిమందు తాగేసి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయం గమనించిన కుటుంబసభ్యులు వెంటనే 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

ఆటో, బైక్ ఢీ: ఇద్దరికి గాయాలు


108 వాహనంలో క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

బొబ్బిలి రూరల్: దత్తిరాజేరు మండలం విజయరాంపురానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వస్తుండగా వెనుకనుంచి వస్తున్న ఆటో ఢీకొనడంతో గాయాలపాలయ్యారు. ఆదివారం మండలంలోని రంగరాయపురం వద్ద జరిగిన ఈ ప్రమాదంలో విజయరాంపురానికి చెందిన గౌరి ఆమె కుమారుడు సునీల్ కుమార్‌లు గాయపడగా వారిని బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందజేశారు.

రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తికి..

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఒక రైలు బదులు పొరపాటున మరో రైలు ఎక్కి దిగుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి దూబ అప్పన్న అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 ఈఎంటి జయముని, పైలట్ సీహెచ్.తవిటినాయుడులు అక్కడికి చేరుకుని క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. శ్రీకాకుళం జిల్లాలోని సంత బొమ్మాళికి చెందిన దూబ అప్పన్న చీపురుపల్లి రైల్వేస్టేషన్‌లో హౌరా–చెన్నయ్ మెయిల్ ఎక్కి తరువాత తాను ఎక్కాల్సిన రైలు కాదని తెలుసుకుని దిగుతుండగా ప్రమాదవశాత్తూ కాలు ఇరుక్కుపోయింది. ఇంతలోనే రైలు కదలడంతో కుడి కాలు మొత్తం నుజ్జునుజ్జయ్యింది.

చిచ్చు రేపిన డీలర్ ఉద్యోగం

- జనసేన, టీడీపీ వర్గీయుల మధ్య కొట్లాట
- ఆస్పత్రిలో చేరిన క్షతగాత్రులు


ఆస్పత్రిలో చేతికి కట్టుతో టీడీపీ కార్యకర్త మక్కువ సత్యం అప్పలరాజు


పెద్ద బూరాడపేటలో వివరాలు సేకరిస్తున్న ఎస్సై గణేష్



పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన జనసేన నాయకులు

నెల్లిమర్ల రూరల్: ప్రశాంతంగా ఉన్న గ్రామంలో ఒక్కసారిగా అలజడి రేగింది. జనసేన, టీడీపీ వర్గీయుల మధ్య చెలరేగిన ఘర్షణ చినికి చినికి గాలివానలా మారి అది కాస్తా కొట్లాటకు దారి తీసింది. దీంతో గ్రామంలో ఏం జరుగుతోందో తెలియక ప్రజలంతా ఉలిక్కిపడ్డారు. అసలు తగాదాలకు చోటే లేని గ్రామంలో రాజకీయ అశాంతి నెలకొనడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు ఎప్పుడూ చూడలేదంటూ ముక్కున వేలేసుకున్నారు. ఈ ఘటనపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నెల్లిమర్ల మండలంలోని పెద్ద బూరాడపేట గ్రామంలో టీడీపీకి చెందిన రేకపాటి వెంకట పాపారావు కుటుంబసభ్యులు గత 40 ఏళ్లగా రేషన్ షాపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల రేషన్ షాపు డీలర్ పోస్టుకు నోటిఫికేషన్ ఇవ్వడంతో జనసేన నాయకుడు మక్కువ హరి సతీమణి కుమారిని డీలర్‌గా ఎంపిక చేస్తూ ఉత్తర్వులు కూడా ఇచ్చారు. ఈ నేపథ్యంలో మండలానికి చెందిన జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలు గ్రామంలో 'గుడ్ మార్నింగ్ జనసేన' కార్యక్రమం పేరిట ఆదివారం పర్యటించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి మరీ గ్రామంలోని రచ్చబండ వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన జనసేన నాయకులను డీలర్ పోస్టు విషయమై టీడీపీ నాయకులు ప్రశ్నించారు. ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పటి నుంచి డీలర్‌గా తమ పార్టీకి చెందినవారే వ్యవహరిస్తున్నారని తమను కాదని నిన్నమొన్న వచ్చిన జనసేన నాయకుడికి ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. దీంతో తాము ఏది చెబితే అదే జరుగుతుందని జనసేన నాయకులు బదులివ్వడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. క్షణాల్లో ఒకరిపై ఒకరు చేయి చేసుకుని కొట్లాడుకున్నారు. ఈ ఘటనలో టీడీపీ కార్యకర్త మక్కువ సత్యం అప్పలరాజు చేయి విరిగిపోవడంతో నెల్లిమర్ల మిమ్స్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. అసలు జనసేన ఉనికి లేకపోయినప్పటికీ ఎంతో శ్రమించి పార్టీ విజయనాకి సహకరించామని తమపై దాడికి పాల్పడి మనోభావాలు దెబ్బతీశారంటూ టీడీపీ నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పెనుగులాటలో పలువురు టీడీపీ, జనసేన కార్యకర్తలు స్వల్పంగా గాయపడ్డారు.

పోలీస్ పికెట్ ఏర్పాటు

గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలగడంతో స్థానిక ఎస్సై గణేష్ హుటాహుటిన గ్రామానికి వెళ్లారు. సీఐ రామకృష్ణ గ్రామాన్ని సాయంత్రం సందర్శించారు. స్థానికులతో మాట్లాడి తగాదాకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. కాగా ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదిర్చేందుకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో చర్చలు కొనసాగుతున్నాయి.

కనులపండువగా సిరిమాను చెట్టు ఊరేగింపు


పట్టణంలో జరుగుతున్న అమ్మవారి సిరిమాను చెట్టు ఊరేగింపు


ఆకట్టుకున్న బళ్ల వేషాలు

సాలూరు: సాలూరు పట్టణంలో మే నెలలో జరగనున్న శ్రీ శ్యామలాంబ తల్లి జాతర ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇందులో కీలకమైన అమ్మవారి సిరిమాను చెట్టు ఊరేగింపు కనుల పండువగా జరిగింది. సుమారు 50 జతల ఎద్దులు, 2 ట్రాక్టర్‌లతో వేలాదిమంది భక్తులు తరలిరాగా పురవీధుల్లో అమ్మవారి సిరిమాను ఊరేగింపు వేడుకగా జరిగింది. దారిపొడవునా భక్తులు ముగ్రాటలు, పసుపు కుంకుమలు సిరిమానుపై వేసి పూజలు చేశారు. ఎడ్ల బండ్లు ప్రత్యేక ఆకర్షణీయంగా నిలుస్తూ, అంతరించిపోతున్న నాటి సంప్రదాయం మళ్లీ గుర్తుకువచ్చేలా చేశాయి. పులివేషాలు, తీన్మార్, సన్నాయి మేళం నడుమ ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. స్థానికంగా ఆధ్యాత్మికతతో కూడిన సందడి వాతావరణం నెలకొంది.

డ్రోన్స్, సీసీ కెమెరాలతో నిఘా


రద్దీ ప్రాంతాల్లో డ్రోన్స్‌తో నిఘా పెట్టిన పోలీస్ శాఖ

- ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: డ్రోన్స్, సీసీ కెమెరా నిఘాతో నేరాల కట్టడి, నియంత్రణకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ప్రధానంగా పట్టణాల్లో జరుగుతున్న నేరాలను నియంత్రించేందుకు పోలీస్‌శాఖ ఐడీ పార్టీలతో పాటు డ్రోన్స్‌ను వినియోగించడం ప్రారంభించింది. ప్రస్తుతం విజయనగరంలో మూడు డ్రోన్ కెమెరాలతో పాటు కొత్తగా సీసీ కెమెరాలను కూడా వినియోగించేందుకు పోలీస్ శాఖ చర్యలు చేపట్టింది. ఇదే విషయాన్ని ఎస్పీ వకుల్ జిందల్ చెప్పారు. జిల్లా కేంద్రంతో పాటు మూడు సబ్ డివిజన్‌లైన బొబ్బిలి, చీపురుపల్లి, విజయనగరం పరిధిలో పండగలు, ఉత్సవాలు, ర్యాలీలు వంటి బహిరంగ కార్యక్రమాల్లో ఎలాంటి అల్లర్లు, గొడవలు జరగకుండా డ్రోన్స్ వినియోగిస్తున్నట్టు ఎస్పీ చెప్పారు. ప్రస్తుతం ఉన్న మూడు డ్రోన్స్‌తో పాటు సీసీ కెమెరాలను కూడా వినియోగిస్తున్నామన్నారు.ఈ మూడు సబ్ డివిజన్‌ల పరిధిలో అన్ని సంస్థలు, రద్దీగా ఉన్న ప్రాంతాల్లో ఆయా సంస్థల ప్రతినిధులతో సీసీ కెమారాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. అలాగే రహదారి ప్రమాదాలు అరికట్టేందుకు, ఈవ్‌టీజింగ్ నియంత్రణ, చైన్ స్నాచింగ్‌లు జరగకుండా ఉండేందుకు డ్రోన్స్ వాడుతున్నామన్నారు. ఇక రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి తద్వారా అసలు ప్రమాదాలే జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డ్రోన్స్‌తో పాటు సీసీ కెమెరాలను సంబంధిత సంస్థలు, ప్రతినిధులతో కొనుగోలు చేయించి అమర్చుతున్నామని ఎస్పీ వకుల్ ఈ సందర్భంగా అన్నారు. ఈ తరహాలోనే జనవరి, ఫిబ్రవరి నెలల్లో బహిరంగంగా మద్యం తాగిన వారిని గుర్తించామని చెప్పారు. అలాగే మద్యం తాగి వాహనాలను నడిపిన వారిని గుర్తించి దాదాపు 4,300 కేసులు కేసులునమోదు చేశామని తెలిపారు.

బర్డ్‌ఫ్లూపై ఆందోళన అనవసరం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు


డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు

పార్వతీపురంటౌన్: జిల్లాలో బర్డ్‌ఫ్లూ సోషల్ మీడియా, ఇతర ప్రసార మాధ్యమాల్లో వస్తున్న ఉదంతులు, అపోహాలు నమ్మవద్దని, ఏ ఒక్కరూ భయపడాల్సిన పనిలేదని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బర్డ్‌ఫ్లూ నియంత్రణపై ప్రజలందరికీ అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. బర్డ్‌ఫ్లూ పక్షులకు మాత్రమే వస్తుందని, ప్రజలు తగిన జాగ్రత్తలు పాటిస్తే వైరస్ సోకదని స్పష్టం చేశారు. బర్డ్‌ఫ్లూ సోకిన ప్రాంతాల ప్రజలు ఆరోగ్యంగా ఉండడానికి మాత్రమే కాకుండా వైరస్‌వ్యాప్తిని అడ్డుకోవడానికి పలు జాగ్రత్తలు అవసరమని తెలిపారు. ఏదైనా జ్వరం, జలుబు, తలపోటు, ఒళ్లు నొప్పులు, కండరాల నొప్పులు వంటి లక్షణాలు వచ్చిన వెంటనే వైద్యసిబ్బందికి తెలియజేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా వైద్య బృందాలను ఏర్పాటు చేసి ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఇంటింటి నిఘా కోసం ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సీహెచ్‌ఓలు, ఎంఎన్‌ఓలతో బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కోడుగుడ్లు, చికెన్ వినియోగానికి ముందు శుభ్రం చేసుకోవడంతో పాటు వంటకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 160 డిగ్రీల వద్ద వేడిచేసి తినాలని సూచించారు.

అలరించిన సంగీత విభావరి

విజయనగరం టౌన్: ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ 67వ వార్షికోత్సవం పురస్కరించుకుని బండారు చిట్టిబాబు పర్యవేక్షణలో బండారు రమణమూర్తి సంగీత దర్శకత్వంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన లలిత సంగీత విభావరి ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. వేణువుపై వెల్లంకి కూర్మనాథం, కీబోర్డుపై సోమేష్, ప్యాడ్స్‌పై బాబూరావు, తబలాపై రమణమూర్తి సహకరించారు. వ్యాఖ్యాతగా మండా వెంకట కామేశ్వరరావు, గాయకులు సాయి ప్రశాంతి, శ్రీవిద్య, శారద, శైలజ, పావని, భాస్కర్ తమవంతు సహకారం అందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ధవళ సర్వేశ్వరరావు, కార్యదర్శి డాక్టర్ మండపాక రవి, కాళ్ల నిర్మల, సంగీతాభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లి చండీయాగం


చండీయాగం నిర్వహిస్తున్న వేద పండితులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడి తల్లి అమ్మవారు చండీయాగం స్థానిక రైల్వేస్టేషన్ వద్ద నున్న వనంగుడిలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదపండితులు సాయికిరణ్, వెలువలపల్లి నరసింహమూర్తిలు అమ్మవారి చండీయాగ ప్రక్రియను చేశారు. అనంతరం యాగం విశిష్టతను భక్తులకు వివరించారు. యాగంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి శేష వస్త్రాలను, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మనసులోనే.. మధనపడుతూ...!

- ఆరోగ్యశ్రీ భోజనంలో డొల్లతనం...!
- నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారనే ఆరోపణలు
- జిల్లాలో ఆరోగ్యశ్రీ ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రులు 25
- ప్రభుత్వ నెట్‌వర్క్ ఆస్పత్రులు 9
- 46 పీహెచ్‌సీల్లో కూడా ఆరోగ్యశ్రీ అమలు
- ఈ ఆస్పత్రుల్లో కేటాయించిన బెడ్లు 1220
- సగటున ప్రతీ రోజు 1000 నుంచి 1200 మందికి భోజనాలు

వారంతా ఆరోగ్యశ్రీ రోగులు.. నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందుతున్నారు. ఆరోగ్యశ్రీ కింద నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో చికిత్స పొందే రోగులకు నాణ్యమైన భోజనం అందించాల్సి ఉంది. కానీ ఆ పరిస్థితి పలు ఆస్పత్రుల్లో లేదనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. భోజనం బాగా లేకున్నా... ఇవ్వాల్సినంత పరిమాణంలోనే ఇవ్వకున్నా... ఆ రోగులు మనసులోనే మధనపడుతూ వైద్య సేవలు పొందుతున్నారు. భోజనం బాగాలేదని బయటకు చెబితే సేవల్లో ఎక్కడ నిర్లక్ష్యం ప్రదర్శిస్తారోనని వారంతా కలత చెందుతూ లోలోపల బాధ పడుతూ వైద్య సేవలు పొందుతున్నారు.


ఎస్.కోటలో ఓ నెట్‌వర్క్ ఆస్పత్రిలో రోగికి అందించిన నాణ్యత లేని భోజనం


సర్వజన ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ రోగులు



విజయనగరం ఫోర్ట్:

జిల్లాలో ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్య సేవ) పథకం కింద చికిత్స పొందే రోగులకు అందించే భోజనంలో నెట్‌వర్క్ ఆస్పత్రులు నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ నిబంధనలను పక్కనపెట్టి ఏదో పెట్టాం.. వారే తింటారన్న చందాన నెట్‌వర్క్ ఆస్పత్రులు భోజనం పెడుతున్నట్టు రోగుల నుంచి గుసగుసలు వినిపిస్తున్నాయి. నాణ్యత... పరిమాణం రెండూ పాటించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో నిబంధనలు అసలు పాటించడం లేదన్నది రోగుల అభిప్రాయంగా ఉంది. వాస్తవానికి సాధారణ రోగుల కంటే ఆరోగ్యశ్రీ రోగులకు మెరుగైన భోజనం అందించాలి.

లోలోపల..

ఆరోగ్యశ్రీ రోగులకు అందించే భోజనం బాగాలేకపోయినా రోగులు బయటకు చెప్పలేకపోతున్నారు. ఎక్కడైతే ఆరోగ్యశ్రీ కింద పేషంట్ జాయిన్ అవుతాడో అక్కడే పూర్తి స్థాయిలో చికిత్స పొందాల్సి రావడంతో బయటకు చెబితే వైద్య సేవలు అందించడంలోనూ ఇబ్బందులు పెడతారని మనసులోనే.. మధన పడుతున్నారు. కానీ బయటకు చెప్పడం లేదు.

జిల్లాలో ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రులు 25

జిల్లాలో ఆరోగ్యశ్రీ ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రులు 25 ఉన్నాయి. అభినవ ఆస్పత్రి, అమృత, ఆంధ్ర, గాయిత్రి, జీఎంఆర్ వరలక్ష్మి, కావేరి, కొలపర్తి, ముప్వగోపాల, నెప్రో ప్లస్, పీజీ స్టార్, పుష్పగిరి విక్టోరియా రెటినో ఇనిస్టిట్యూట్, క్వీన్స్ ఎన్ఆర్ఐ, సంజీవిని సూపర్ స్పెషాలటీ, బాబూజీ, శ్రీసాయి సూపర్ ఆస్పత్రి, శ్రీసాయికృష్ణ, సాయి పీవీఆర్, శ్రీనివాస నర్సింగ్ హోమ్, సన్‌రైజ్, స్వామి కంటి ఆస్పత్రి, తిరుమల మెడికవర్ ఆస్పత్రి, వెంకటరామ, వెంకటపద్మ ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకం ఉంది. ప్రభుత్వ నెట్‌వర్క్ ఆస్పత్రులు 55 ఉన్నాయి. ఇందులో జిల్లా ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రి, సీహెచ్‌సీలు 9 ఉన్నాయి. పీహెచ్‌సీలు 46 ఉన్నాయి. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, బొబ్బిలి సీహెచ్‌సీ, గజపతినగరం ఏరియా ఆస్పత్రి, రాజాం ఏరియా ఆస్పత్రి, ఎస్.కోట ఏరియా ఆస్పత్రి, బాడంగి సీహెచ్‌సీ, భోగాపురం సీహెచ్‌సీ, బొబ్బిలి సీహెచ్‌సీ, నెల్లిమర్ల సీహెచ్‌సీ, ఘోషాస్పత్రి.

నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో 1220 బెడ్లు కేటాయింపు

ప్రభుత్వ, ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించి 1220 బెడ్లు కేటాయించారు. ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో 751, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రిల్లో 321, పీహెచ్‌సీల్లో 148 బెడ్లు కేటాయించారు. ఇందులో సగటున 1000 నుంచి 1200 మంది వరకు రోగులు చికిత్స పొందుతుంటారు. వీరికి మెరుగైన భోజనం అందించాల్సి ఉంది.


విజయనగరంలోని ఓ నెట్‌వర్క్ ఆస్పత్రిలో రోగులకు అందించిన భోజనం

భోజనం మెనూ ఇలా...

ఆరోగ్యశ్రీ నిబంధనల ప్రకారం రోగులకు ఉదయం 150 గ్రాముల గల మూడు ఇడ్లీ, 100 గ్రాముల చట్నీ, మిల్క్ బ్రెడ్ ఏడు స్లైస్‌లు ఉన్నవి (140 గ్రాములు, బన్సీ రవ్వ ఉప్మా రవ్వ (300 గ్రాములు) వీటిల్లో ఏదో ఒకటి పెట్టాలి. అదేవిధంగా 150 ఎం.ఎల్ పాలు ఇవ్వాలి. మధ్యాహ్నం మూడు పుల్కాలు (ఒక్కోటి 30 గ్రాములు బరువు ఉండాలి) గాని, 450 గ్రాముల సోనామసూరి వండిన అన్నం, వెజిటిబుల్ కర్రీ ఒక కప్పు, సాంబారు(30 గ్రాములు కందిపప్పు ఉండాలి), 50 గ్రాముల గల ఉడికించిన గుడ్డు, 100 గ్రాముల పెరుగు, అరటి పండు ఒకటిగాని సీజనల్‌గా దొరికే పండుగాని ఇవ్వాలి. రాత్రికి 3పుల్కాలు (30 గ్రాములు బరువు ఉండేవి) గాని సోనామసూరి రైస్ 450 గ్రాములు వండిన అన్నం, మిక్స్‌డ్ వెజిటిబుల్ కర్రీ ఒక కప్పు, సాంబారు (కంది పప్పు 30 గ్రాములు ఉండాలి), 50 గ్రాముల ఉడికించిన గుడ్డు ఒకటి, 150 గ్రాముల పాలు రెండు టీ స్పూన్‌ల పంచదారతో కలిపి ఇవ్వాలి. కానీ ఈ మెనూ చాలా నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో అమలు కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అన్నంతో పాటు, పాలు, కూర, సాంబారు, పెరుగులోనూ నాణ్యత, పరిమాణం పాటించడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. అన్నం, పెరుగు, పరిమాణం తక్కువగా ఉంటుందనే విమర్శలూ వ్యక్తం అవుతున్నాయి. సాంబారులో వేయాల్సిన పరిమాణంకు తగ్గట్టుగా కంది పప్పు వేయడం లేదని చెబుతున్నారు. ప్రతీ రోజు ఈ భోజనాన్ని ఆరోగ్యశ్రీ అధికారులు, సిబ్బంది పరిశీలించాల్సి ఉండగా, పరిశీలన పూర్తి స్థాయిలో జరగడం లేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

భోజనాన్ని పరిశీలిస్తాం..

ఆరోగ్యశ్రీ రోగులకు నాణ్యతతో కూడిన మెరుగైన భోజనం మెనూ ప్రకారం ఇవ్వాలి. ప్రతీ రోజు ఆరోగ్యమిత్రాలను భోజనం రుచి చూడాలని చెబుతున్నాం. ఆస్పత్రుల్లో రోగులకు అందించే భోజనాన్ని పరిశీలిస్తాం. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ కొయ్యాన అప్పారావు, ఆరోగ్యశ్రీ ఇన్‌చార్జి కో – ఆర్డినేటర్

'చీకటి పువ్వు'కు ప్రథమ బహుమతి

- ద్వితీయ బహుమతి దక్కించుకున్న కొత్త పరిమళం
- ఘనంగా ముగిసిన నాటక పోటీలు


ఉత్తమ ప్రదర్శన బహుమతిని అందజేస్తున్న దృశ్యం

నెల్లిమర్ల: నగరపంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో మూడు రోజులపాటు జరిగిన ఆరిపాక బ్రహ్మానందం స్మారక నాటక పోటీల్లో కరీంనగర్ చైతన్య కళాభారతి కళాకారులు ప్రదర్శించిన 'చీకటి పువ్వు' నాటిక ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శన బహుమతి శ్రీకాకుళం జిల్లా బొరివంకకు చెందిన శార్వాణి గిరిజన సాంస్కృతిక సేవా సంఘం కళాకారులు ప్రదర్శించిన 'కొత్త పరిమళం' నాటికకు లభించింది. కాగా తృతీయ ఉత్తమ ప్రదర్శనగా విశాఖపట్నం తెలుగు కళా సమితి కళాకారులు ప్రదర్శించిన 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత?' నాటిక నిలిచింది. శనివారం అర్ధరాత్రి జరిగిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ, నగర పంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు, అవనాపు సత్యనారాయణ, గ్రామ పెద్దలు బహుమతులు అందజేశారు.

విజేతల వివరాలు

ఉత్తమ దర్శకుడు బహుమతి మంచాల రమేష్ (చీకటి పువ్వు), ఉత్తమ రచయిత బహుమతి కేకేఎల్ స్వామి (కొత్త పరిమళం), ఉత్తమ నటుడు బహుమతి పి.వరప్రసాద్ (నిశ్శబ్దమా నీ ఖరీదెంత)కు లభించాయి. ద్వితీయ ఉత్తమ నటుడుగా డి.గిరిబాబు (చీకటి పువ్వు), ఉత్తమ నటిగా జి.లహరి (చీకటి పువ్వు) ద్వితీయ ఉత్తమ నటిగా డి.హేమ (నిశ్శబ్దమా నీ ఖరీదెంత)ఉత్తమ క్యారెక్టర్ నటుడుగా రాంబాబు (నిశ్శబ్దమా నీ ఐరీదెంత), ఉత్తమ సహాయ నటుడుగా శోభన్ బాబు(కొత్త పరిమళం) ఉత్తమ విలన్‌గా దలం (కొత్త పరిమళం), ఉత్తమ హాస్యనటుడిగా బి.కన్నబాబు (నిశ్శబ్దమానీ ఖరీదెంత)కు బహుమతులు లభించాయి. ఉత్తమ రంగాలంకరణ రమణ (కొత్త పరిమళం), ఉత్తను సంగీతం లీల –మోహన్ (చీకటి పువ్వు), ఉత్తమ ఆహార్యం రమణ (కొత్త పరిమళం) జ్యూరీ బహుమతులు సత్యనారాయణ (దేవరాగం), డి.రాధాకృష్ణ (ఎడా రిలో వాన చినుకు) భుజంగరావు (రైతే రాజు)కు లభించాయి. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కుసుమాల నాగభూషణం, కేవీ మంగారావు, మానాపురం సత్యనారాయణ వ్యవహరించారు.